
# తృప్తి

సింగంపల్లి శ్యామకుమారి



"నా మాట విను సుశీలా! పిల్లలు చూస్తే బావుండదు. లే! లేచి కాస్త ఎంగిలిపడు." గదిలో లైటు వేసి వచ్చి, భార్య భుజం మీద చేయి వేస్తూ, గుర్నాథంగారు అనునయంగా చెప్పారు.

సుశీలమ్మ భర్త చేతిని విసురుగా తోసేసింది!

"ఈ యింట్లో నా ఆరాటం, ఆవేదన వినే దిక్కేలేదు. మీ తండ్రీ బిడ్డలు అంతా ఒక్కటేగా! యిక నేను ఏమైపోతే మాత్రం మీకు దేనికి?" అని సాధింపుగా అంటూ, పైటచెంగుతో కళ్ళు వత్తుకుని, అటుపక్కకి వత్తిగిలి పడుకుంది.

భార్య నిష్ఠూరానికి, ఆయన వెంటనే ఏం మాట్లాడలేక పోయారు. మెల్లగా ఆవిడ పక్కనే చాప మీద కూర్చుని, భార్యని పూర్తిగా తన కభిముఖంగా తిప్పుకోవటానికి ప్రయత్నించారు.

చివరికి, సుశీలమ్మకి లేచి కూర్చోక తప్పలేదు.

"చూడు సుశీలా! పాతికేళ్ళుగా నాతో కాపురం చేస్తున్నావు ఆ మాత్రం నా మనసు అర్థం చేసుకోలేవూ? ఒక్కక్షణం ఆలోచించి నిజంచెప్పు? నేను చెప్పేవన్నీ అర్థం లేని మాటలే అంటావా?" భార్య భుజాల చుట్టూ చేతులు వేసి, పసిపిల్లని పొదివి పట్టుకున్నట్టుగా దగ్గరికి తీసుకుంటూ అడిగారు.

సుశీలమ్మ సమాధానం చెప్పలేనట్టు మౌనంగా వుండిపోయింది.

ఒక్కోసారి భర్త ధోరణి ఆవిడకి చెప్ప లేని చిరాకుని, కోపాన్ని తెప్పిస్తుంది. ఆయన ఎప్పుడూ యింతే! యిద్దరి మధ్యా ఏదైనా ప్రసక్తి వచ్చినప్పుడు, ఆ విషయాన్ని భార్య చేత 'అవుసని' అనిపించలేకపోతే, కుటుంబ పరిస్థితులు కళ్ళముందుకి తెచ్చి, తుది నిర్ణయంగా ఆ సమస్యని ఆవిడకే వదిలేస్తారు. అటువంటి సమయంలో సుశీలమ్మ తటస్థంగా వుండి పోతుందని ఆయనకి తెలుసు.

అసలు ఈ విషయంలో భార్యాభర్తలిద్దరికి వారం రోజుల నుంచి సన్నగా, వాగ్యుద్ధం లాంటిది సాగుతోంది. భార్యని సమాధాన పరచలేక ఆయన, భర్తని, ఒప్పించలేక ఆవిడ మాటా మాటా అనుకుంటూనే వున్నారు. సుశీలమ్మ ఏదో ఒకటి ఆయన్ని సాధింపుగా అంటూనే వుంది. అలా అని యింటి పరిస్థితులు ఆవిడకి తెలియదని అనుకోవటానికి కూడా వీల్లేదు.

ఆఖరి కొడుకు జబ్బుకి మందులు, డాక్టరు ఫీజు, మూడో కూతురికి మిషన్ ఫీజు, పెద్దకొడుకు పరీక్ష ఫీజు, వచ్చేపోయే బంధువులకి అదనపు ఖర్చులు ... మొత్తం మీద ఈ నెలలో, పదిహేను రోజులకే దాదాపు రెండు వందల పైనే ఖర్చు అయింది.

అయితే, ఈ ఖర్చులకి కూతుర్ని రప్పించుకోవడానికి, భర్త పెట్టే అభ్యంతరం ఆవిడకి అర్థం లేనిదిగా తోచింది.

"బాలసారెకి మనం ఎటూ వెళ్ళనేలేదు. కనీసం పండక్కి కూడా పిలవకపోతే దాని అత్తగారు వాళ్ళు ఏమనుకుంటారు?" అంది సుశీలమ్మగారు.

"నా బాధ కూడా అదే సుశీలా! చంటాడికి చిన్నమెత్తు బంగారం చేయించలేక, వెళ్ళటం మానుకున్నాము. తీరా రేపు పండక్కి పిలిపించి, ముగ్గురికి బట్టలు అయినా తీయించకపోతే బావుంటుందా చెప్పు?" గుర్నాథంగారు దిగులుగా అడిగారు.

"బట్టలకోసం గోల చేయటానికి నా కూతురు పసిపిల్ల ఏం కాదు!" మళ్ళీ భర్త

ధర్మపథం

# సంగ్రహ భారతం

ఏన పవిత్ర గ్రంధాలలో మహాభారతం ఒకటి. ''భారత: పంచమోవేద:'అని యిది నాలుగు వేదాల తర్వాత మరొక వేదంగా ప్రసిద్ధమయింది. దీనిని బట్టే దాని పవిత్రత వెల్లడి అవుతున్నది. వ్యాసమహర్షి భగవ దవతార పురుషుడు. ఆయన రచించిన గ్రంధం కాబట్టి దానికి విలువ హెచ్చింది. ఉపనిషత్తుగా గౌరవింపబడే భగవద్గీత భారతంలోనిదే!

రామాయణ కధనూ, భాగవత కధనూ నిత్యం ఒక సంగ్రహ శ్లోకంలో పారాయణచేసినట్లే భారతాన్నికూడ పారాయణ చెయ్యడం ప్రాచీనుల సంప్రదాయం. సులభమైన ఆ శ్లోకం యిది–

''ఆదౌ పాండవ ధార్తరాష్ట్ర జననం లాక్షాగృహే దాహనం
ద్యూతే శ్రీహరణం వనే విహరణం మత్స్యాలయే వర్తనమ్,
లీలా గోగ్రహణం విరోధినిధనం సంధిక్రియోజ్జృంభణం
పశ్చాద్భీష్మ సుయోధనాది హననం చైతన్మహా భారతమ్.''

పాండురాజునకు ధర్మజుడు మున్నగు పాండవుల యిదుగురు, ధృతరాష్ట్రునకు దుర్యోధ నాదులు జనించారు. వారు సోదరపుత్రులగుట వలన రాజ్య విషయమై పరస్పరం విరోధం ఏర్పడింది. అసూయా పరులగు ధార్తరాష్ట్రులు పాండవులను చంపదలచి లక్కయింటిలో వారిని ప్రవేశ పెట్టి, వారు నిద్రస్తూఉండగా దాన్ని దహింపజేశారు కాని పాండవులు తప్పించుకున్నారు. తర్వాత వారి వంతుకు వచ్చిన రాజ్యాన్ని కౌరవులు మోసపు జూదంలో అపహరించారు. అప్పుడు చేసుకున్న ఒడంబడిక ప్రకారం పాండవులు పన్నెండేళ్ళు వనవాసం, ఒకయేడు మత్స్య నగరంలో అజ్ఞాతవాసం చేశారు. వారిని కనిపెట్టడానికి ఎత్తుగడయెత్తి కౌరవులు విరటుని గోవులను పట్టుకోగా,జరిగిన యుద్ధంలో విరోధులు పరాజితులైనారు. చావుదెబ్బలు తిన్నారు. పిదప సంధి ప్రయత్నాలు జరిగాయి. కాని ప్రయోజనం లేకపోయింది. ఘోరమైన సంగ్రామం తప్పలేదు. కౌరవ పక్షంలో మహావీరాగ్రణియైన భీష్ముడు మొదలు కౌరవాధి పతి అయిన దుర్యోధనుని వరకూ అందరూ సంహరింపబడినారు విజయంతోపాటు పాండవులకు రాజ్యాధి పత్యం వచ్చిందన్న మాట!

ఈ విధంగా ఈ శ్లోకంలో మహాభారతంలోని ప్రధాన ఘట్టాలన్నీ తెలుపబడినవి. మూడు పాదాలలో ఉద్యోగ పర్వాంత కథ, నాల్గవ చరణంలో మిగిలిన యుద్ధవృత్తాంతం ఉన్నవి. పాండవ విజయమే ఇందులో ప్రధానాంశం. అందువల నే భారతానికి జయమనే ఇతి హాసమనే పేరు వచ్చింది.

చేతుల్ని తోసేస్తూ విసురుగా చెప్పింది ఆవిడ.

''నిజమే ! కాదనను. కానీ, అమ్మాయి మనది అయితే అల్లుడు మనవాడా ? కనీసం ఓ యాభై రూపాయలు అయినా అతని చేతికి యివ్వకపోతే మ ర్యా ద గా వుంటుందంటావా?''

సుశీలమ్మ చ(రుమన్నట్టు తలెత్తి చురుగ్గా చూసింది.

'యిక ఈ చాతకాని సాకులు నాకు చెప్పకండి' అన్నట్టుంది ఆవిడ చూపు. గుర్నాధం గారి మనసు చివుక్కుమన్నట్టయింది.

## తృప్తి

అంతకు మించి, భార్యని అనునయించటానికి ఎలాటి ప్రయత్నం చేయలేదు. నిశ్శబ్దంగా లేచి యివతలికి వచ్చేశారు.

ఆయన మనసంతా దిగులుగా, అశాంతిగా తయారయింది.

'మధ్య తరగతి మనిషిగా పుట్టడంకన్నా అడవిలో మానుగా పు ట్ట ట ం ఎంతో వుత్తమం!' అని అప్పుడప్పుడు ఆయన అనుకుంటూ వుంటారు.

గుర్నాధంగారికి ఆరుగురు సంతానం. నలుగురు ఆడపిల్లలు. యిద్దరు మగపిల్లలు పెద్ద కూతురుకి ఏడాది క్రితం పెళ్ళి చేసారు. పెళ్ళికి ఎదిగిన మరో కూతురు వుంది. పెళ్లికి ఎదగవలసిన వాళ్ళు యింకా యిద్దరు వున్నారు. మూ డో కూ తు రు చదువు అబ్బక సెవెన్త్ క్లాస్ తప్పి రెండేళ్ళుగా ఖాళీగా వుంటోంది. ఆపిల్ల ఉత్సాహం చూసి, నాలుగైదు నెలలుగా కుట్టుమిషను నేర్చుకోవటానికి పంపిస్తున్నారు. నాలుగో కూతురు ఈ సంవత్సరమే సెవెన్త్ క్లాసుకి వచ్చింది. ఒక కొడుకు టెన్త్ క్లాసు పరీక్ష రాయబోతున్నాడు. ఆఖరివాడు మూడో క్లాసు చదువుకుంటున్నాడు.

గుర్నాధంగారు చేసే హెడ్ గుమాస్తా గిరికి, యింతమంది సభ్యులు ఆధారపడి వున్నారు. జీతానికి మించిన అవసరాలు. పైగా తరుముకొస్తున్న వయసుతోపాటు నాలుగైదేళ్లలో రిటైర్ కాబోతున్న నిజం ఆయన్ను అనుక్షణం భయపెడుతోంది.

పెద్ద కూతురికి పెళ్లిచేసి, ఏదోబాధ్యత అయితే తీర్చుకున్నారు గానీ, ఆడపిల్లలకి జరగవలసిన అచ్చటా ముచ్చటా ఏం జరిపించలేకపోయారు గుర్నాధంగారు. ఆయన బాధకూడా అదే.

అదీగాక రెండు నెలల క్రితం మనవడు పుట్టాడు. గుర్నాధంగారు మనవడి బాలసారెకి వెళ్లలేకపోయారు. వీలులేక కాదు. చిన్నమెత్తు బంగాలం మనవడికి చేయించే తాహతులేక, వాళ్ళలో అవమానం పొందలేక, ఆత్మాభిమానాన్ని చంపుకోలేక, వెళ్ళటం మానుకొన్నారు.

పదిరోజుల్లో ఉగాది పండుగ వుంది.

బాలసారెకి వెళ్లలేకపోతే పోనీ, కూతుర్ని మనవణ్ణి అయినా పండుగ పే రు తో రప్పించి, తృప్తి పడాలని సుశీలమ్మ ఆరాటం. గుర్నాధంగారికి కూడా మనసులో తీసుకురావాలనే వుంది. కానీ, పరిస్థితులు చూస్తుంటే ఆయన గుండెలు ఆవేదనతో నొక్కుకు పోతున్నాయి.

పంచభక్ష్య పరమాన్నాలు అన్నట్టు ... ఏ విధమైన ఆర్భాటాలు, ఆడంబరాలు లేకపోయినా, కనీసం ఆ బిడ్డతల్లికి పండుగ పూట అయినా కడుపునిండా అన్నం, తృప్తి కోసం కొత్తది వో రవికలగుడ్డా యివ్వగలడా తను ?' అనే బెంగ, గుర్నాధం గారిని మానసికంగా కృంగదీస్తోంది.

ఆపూట భార్య అభోజనంగా పడుకోవటం చూస్తే ఆయన ప్రాణాలు విలవిల్లాడి పోయాయి. ఆ రాత్రంతా ఆయన మనసు కూతుర్ని పిలవటమా? మానటమా?' అన్న ద్వైదీభావ సంఘర్షణతోనలుగుతూనే వుంది

* * *

మర్నాడు రాత్రి భోజనాల సమయంలో...

"కుట్టుకి వెళ్ళాలంటే సిగ్గేస్తోంది నాన్నా! ఒకటే ఓణీ అయిపోయింది." అంటూ, మూడో కూతురు మెల్లగా చెప్ప లేక చెప్పింది

గుర్నాథంగారు తలెత్తి కూతురి వేపు పరిశీలనగా చూసారు.

'నిజమే! వాళ్ళ అమ్మవి, పాతవి నలిగిన చీరలు చినుగులు కుట్టి, కాస్త గట్టిగా వున్న భాగం చింపి, వోణీలుగా వాడుకుంటోంది. ఏవో ఆ మధ్య తక్కువ ధరలో వచ్చిందని, ఎనిమిది రూపాయలు పెట్టి, వో పూల వోణి తీసుకున్నాడు తను. అది కూడా వోల్డుస్టాకు కాబోలు, అక్కడక్కడ వల్లపూల దగ్గర చివికిపోయి, చివగటానికి సిద్ధంగా వుంది...ప్చ్...ఏం బ్రతుకులో!' యధాలాపంగా చివరి మాట పైకే అనేశారు.

కొడుక్కి కూర వడ్డిస్తున్న సుశీలమ్మ తల తిప్పి భర్త వేపు చూసింది. ఆయన పరధ్యాసగా అన్నం కలుపుతున్నారు.

"పులుసు వేయమంటారా?" అని ముక్తసరిగా అడిగింది.

"వద్దు మజ్జిగ పోసుకుంటాను" అంటూ పులుసు సగం కలిసిన అన్నంలోనే, మజ్జిగ వంపేసుకున్నారు.

సుశీలమ్మ విస్తుపోయినట్టు, అలా

# తృప్తి

చూస్తుండిపోయింది.

గుర్నాథంగారు అయిష్టంగానే భోజనం పూర్తిచేసి లేచారు. ఆ తర్వాత అలవాటుగా కాసేపు కబుర్లు చెప్పటానికి ఆయన భార్యని పిలవలేదు. అలసటతో, అంతకు మించిన అశాంతితో, మంచం మీద వాలిపోయారు.

ఆ రోజు వుదయం ఆయన ఆఫీసుకి వెళుతుంటే టెన్తు చదుతున్న కొడుకు, తనకి పరీక్షలు దగ్గర కొస్తున్నాయని రాసుకోవటానికి మంచి పెన్ను. లేదని, అది కావాలని అడిగాడు. సెవెన్తు చదువుతున్న కూతురు తనకి తెలుగు టెస్టు పుస్తకం కావాలని అడిగింది.

'యిప్పటికొచ్చి తను ఆ పుస్తకం కొనలేకపోయాడు. అది లేక రోజూ టీచరు క్లాసులో బెంచీ మీద నిలబెడుతుందట. పరీక్షలు దగ్గరకొస్తున్నాయని, తప్పనిసరిగా కొనమని, ఆ టీచరు హెచ్చరించిందని యిది ఏడుపు మొహంతో చెప్పింది. ఆఖరికి చంటాడుకూడా ఫిర్యాదే చేతికి, అందని చిన్న పెన్సిల్ ముక్క చూపించి, ఓ మంచి పెన్సిల్ పెద్దది తీసుకురమ్మని నొక్కి మరీ చెప్పాడు.

యిక తన అవసరాలు నోరువిప్పి అస్సలు అడగనిది రెండో కూతురు. ఆ కూతురికి అవసరాలంటూ వున్నా లేకపోయినా, వాటిని మించిన పెద్ద బాధ్యత ఒకటి తన మీద వుందని గుర్నాథంగారు ఎప్పుడూ మరిచిపోలేదు. సంబంధాలు చూస్తూనే వున్నారు.

ఈ పరిస్థితులు తన జీతం పరిమితి దాన్ని మించిపోతున్న అవసరాలు చూస్తుంటే ఆయనకి యిదంతా ఛేదించలేని ఓ సమస్యల వలయంలా అనిపించసాగింది. కనీసం కొడుక్కి ముప్పై పైసలుపెట్టి పెన్సిల్ కూడా కొనియివ్వలేని ఆర్ధిక పరిస్థితులకి ఆయన మనసు అవమానంతో, బాధతో కుమిలిపోయింది.

గుర్నాథంగారి ఆవేదనతో, ఆలోచనతో తనకేం ప్రమేయం లేనట్టు వారం రోజులు గిర్రున తిరిగిపోయాయి!

ఆ రోజు ఆయన కాస్త త్వరగానే ఆఫీసు నుంచి వచ్చారు. యింట్లో అడుగుపెడుతూనే తెల్లబోయినట్టు నిలబడిపోయారు. గది మధ్యలో కూర్చున్న పెద్ద కూతురు నెలల బాబుని కాళ్ళమీద పడుకోబెట్టుకొని నిద్రపుచ్చుతోంది. తండ్రిని చూస్తూనే ఆ పిల్ల మొహం సంతోషంతో విప్పారింది. గబగబా కొడుకుని భుజంమీద వేసుకుని తండ్రిదగ్గరకొస్తూ...

"ఒంట్లో కులాసాగా వుంటున్నారా నాన్నా?" ఆర్తిగా అడిగింది.

"ఆఁ... బావుందమ్మా! అల్లుడుగారు రాలేదా? యిల్లంతా గాలిస్తున్నట్టు చూసి ఆప్యాయంగా అడిగారు.

"శలవు లేదట. పండుగరోజుకి వస్తానని చెప్పారు" అంది.

"అలాగా!" ఆయనఅంతకన్నా ఎక్కువగా ఏం మాట్లాడలేకపోయారు మెల్లగా తలుపు మూల చెప్పులు విడిచి, పెరటి వేపువెళ్ళారు. అక్కడ సుశీలమ్మకూతురి బట్టలు పిండి ఆరేస్తోంది.

"అమ్మాయి ఎప్పుడు వచ్చిందిసుశీలా?" అంటూ మెల్లగా భార్యని అడిగాడు


"మీరు అలా ఆఫీసుకివెళ్ళారు. అదియిలా రిక్షాదిగింది!" అని ముక్తసరిగా చెప్పింది.

ఆయన యింకేం అడగలేదు. కూతురు అంత హఠాత్తుగా రావడం ఆయనకి కాస్త ఆశ్చర్యంగానే వుంది. 'తనురమ్మని ఉత్తరం రాయలేదుకదా?' అనుకున్నారు వెంటనే ఆ ప్రశ్నకి సిగ్గుపడి నవ్వుకున్నారు.

'పుట్టింటికి రావటానికి తన బిడ్డకి ఒకరి అనుమతి కావాలా?' కూతురు అలా రావటం ఓ విధంగా సంతోషంగావున్నా, మరోవిధంగా ఆయన మనసు అవ్యక్తమైన బాధతో,సిగ్గుతో కృంగిపోతున్నట్టనిపించింది.

మరో రెండు రోజులు గడిచిపోయాయి!

ఆ రోజు గుర్నాథంగారి ఆఫీసరు శలవు పెట్టారు.



దేహపుష్టికి
ఆరోగ్యానికి
పండిత-డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17.

# తృప్తి

ఆ మర్నాడే వుగాది!

ఆఫీసు పనిమీద గుర్నాథంగారు, ఓ గంట ముందు పని ముగించుకుని, ఆఫీసరు యింటికి బయలు దేరారు. ఆయన వెళ్ళే సరికి, ఆఫీసరు, ఆయన భార్య ఏదో విషయంలో సన్నగా ఘర్షణ పడుతున్నారు. ఆ సంభాషణ తీరు, మొహంలో చిరుకోపం చూసి, గుర్నాథంగారు అది సరస సంభాషణగా గ్రహించారు. పైగా వాళ్ళు ఎక్కడికో ప్రయాణం అవుతున్నారని కూడా అర్థం చేసుకున్నారు.

"ఓ! మీరా! రండి! రండి!" ఆఫీసరు గుర్నాథంగారిని చూస్తూనే, చిరునవ్వుతో ఆహ్వానించారు.

సమాన వయసులో వున్న గుర్నాథంగారిని ఆయన మన్నించి మాట్లాడతారు. తన హోదాని ప్రదర్శించుకోవాలనే అతిశయంగానీ, అహంకారంగానీ ఆయనకి లేవు. గుర్నాథంగారంటే, ఓ విధమైన అభిమానంతోపాటు నమ్మకం కూడా వుంది.

"చూడండి! సమయానికి వచ్చారు. బొంబాయి నుంచి వచ్చిన పొదిగిన నెక్లెసు తెచ్చి వారం రోజులు అయినా కాలేదు. యిప్పుడు మళ్ళీ ముత్యాల నెక్లెసు కావాలట." అంటూ అంతక్రితం తమ ఘర్షణకి కారణం వివరించారాయన.

ఆవిడ వుడుక్కున్నట్టుగా చూసింది.

"అది మీ ముచ్చటకు తెచ్చారు. యిది నా ముచ్చటకి కోరుకొంటున్నాను. ఇష్టం లేకపోతే మానేసెయ్ కూడదూ?" అంది చిరుకోపంతో విసురుగా.

"అమ్మమ్మ ఎంత మాట. మానేస్తే వూరుకుంటారా మీ ఆడవాళ్ళు. పంతం పట్టి మరీ సాధిస్తారుగా" అని చిన్నగా నవ్వి గుర్నాథంగారివేపు తిరిగారు.

"చూడండి! మేం షాపింగ్‌కి వెళుతున్నాం. రేపు పండుగ కూడా. ఆఫీసుకి శలవే కదా? రేపు సాయంత్రం రండి! తీరిగ్గా ఆఫీసు విషయాలన్నీ చర్చించుకో వచ్చు!" అన్నారు.

గుర్నాథంగారు వినయంగా చిరునవ్వుతో 'అలాగే' అన్నట్టు తల వూపారు.

కానీ, ఆఫీసు విషయాలకన్నా ముఖ్యంగా తను వచ్చిన కారణం ఆయన బయట పెట్ట లేకపోయారు. గుర్నాథంగారు వెళ్ళిపోవటానికి సిద్ధపడుతుండగా ఆఫీసరు ఆగమని చెప్పి, నోట్స్ పైపుతీసి బల్లమీదపెడుతూ

"మీరు అలా పోస్టాఫీసువైపు వెళతారేమో కదూ? ఈ మూడు వందలు అబ్బాయి పేర్న, రెండు వందలు అమ్మాయి పేర్న మనియార్డర్ చేయండి. అడ్రసులు కూడా యిస్తాను, వుండండి!" అంటూ జేబులోంచి ఓ ఐదు పచ్చ నోట్లు తీసి అందించి, చిన్న కాగితంమీద రెండు అడ్రసులు వ్రాసి యిచ్చారు.

వాళ్ళు తలుపులు వేసుకొని వెళ్ళేవరకు

శక్తిసామ్రాట్
అనేక యోగ్యతా పత్రములు పొందిన దివ్యౌషధం!

దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!

హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు పోస్టు ద్వారా కూడా వైద్యంచేయబడును.
వరిబీజము (బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ. రండి.
డా॥ దేవర, ఫోన్ 551,
మార్వాడి గుడి వద్ద, తెనాలి.
బ్రాంచి: 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.


నల్లులను చంపును
ఏ.జేస్
బక్షినిలిన్-20
పాగ్‌సన్స్ కెమికల్ కొ॥ మద్రాసు-21.

బుతుక్రమం అలస్యమైతే?
విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన 'దేవిపిల్సు' వాడండి
దేవి పిల్సు ముఖ్యంగా అలస్యమైన, క్రమముగాకాక పోయిన, బాధతోకూడిన, లేక ఆగిపోయినబహిష్టకు దేవిపిల్సు బాగుగ గుణమిచ్చును

1 అన్నిసందర్భములలోను శీఘ్రముగాను, అమోఘము గాను పనిచేయును
2 ఏస్థితిలోనను అరోగ్యమునకు ఎట్టిహాని కలిగింపదు
ప్రతిచోటదొరకును
Full Course/28 Tablets
Half Course/14 Tablets
Mfrs: SEENU & CO., MADRAS-21.
Stockists: City Pharma Distributors, Vijayawada-1.

ఆగి, వెనకే ఆయనకూడా యింటి దారి పట్టారు.

'ఇంత దూరం వచ్చాడు. కానీ ఏం లాభం! అభిమానం విడిచి అప్పు కావాలని అడగలేక పోయాడు తను!' అని తన బల హీనతని అనేక విధాల నిందించుకున్నారు. ఆ ఆవేదనలో ఆయన గమనించలేదు. పోస్టాఫీసు దాటి అరమైలు పైగానే వచ్చేశారు.

హఠాత్తుగా గుర్తుకొచ్చి, కంగారుగా మళ్ళీ వెనక్కి వెళ్ళారు. కానీ, అప్పటికే మనియార్డర్స్ చేసే టైమ్ దాటిపోయిందని వాళ్ళు చెప్పారు. మర్నాడు పండుగ. అంటే పోస్టాఫీసు అసలు వుండదు.

గుర్నాధంగారు హఠాత్తుగా వది లంక ణాలు చేసిన మనిషిలా అయిపోయారు. గుండెలమీద పెద్ద బరువు మోపినట్టు... ఆయన మనసంతా నీరసం, అలసట ముప్పిరి గొన్నట్టయాయి! వెంటనే యింటికి నడిచి వెళ్ళే ఓపికకూడా లేనట్టనిపించింది. పోస్టాఫీసుకి దగ్గరగా వున్న పార్కులోకి వెళ్ళి కూర్చున్నారు.

ఆ చెట్లగాలికి ప్రాణం కాస్త హాయిగా వున్నట్టనిపించినా, మనసులో సుళ్ళు తిరుగు తున్న ఆలోచన్లు మాత్రం ఆయనకి వూపిరి ఆడనివ్వటం లేదు.

"ఆఫీసరుగారి కొడుకు హైదరాబాద్ యూనివర్సిటీలో చదువుకుంటున్నాడు. కూతురు కాలేజీ ఫ్రండ్స్‌తో కలిసి పిక్‌నిక్‌కి వెళ్ళింది. బహుశా ఏ వూళ్ళోనో వుండి డబ్బుకోసం రాసి వుంటుంది. అడగ్గానే పిల్లలిద్దరికి లేదనకుండా ఆయన వందలు వందలు పంపిస్తున్నాడు.

కానీ, తను పిల్లలు అడిగే కనీసపు కోర్కెలు తీర్చలేకపోతున్నాడు. ఆవిడ మెడలో ఎన్నో రకాల నగలమధ్య పచ్చని నెక్లెసు కళ్ళు చెదరకొడుతూ మెరిసిపో తోంది. అయినా ముత్యాల నెక్లెసుకోసం పట్టుపట్టి మరీ, తన కోరిక చెల్లించు కొంటోంది. మరి తను సుశీలకి ఏం చేయించగలిగాడు? కనీసం ఓ జత గాజులు అయినా దాని చేతికి అలంకరించలేక పోయాడు. ఈ లోపం ఎక్కడ వుంది? ఈ గొప్పవాళ్ళు చేసుకున్న పుణ్యం ఏమిటి? తను చేసిన పాపం ఏమిటి? భగవాన్! ఏమిటి నీ ఈ పక్షపాతం? అని గుర్నాధం గారి మనసు నిస్సహాయంగా ఆక్రోశించింది.

ఆయనకి గానుగెద్దులాంటి ఈ జీవితం, ఓ సమస్యల వలయంలా కనిపిస్తోంది. ఆ వలయంలో తను నిర్దాక్షిణ్యంగా చిక్కు కున్నట్టు పరిస్థితుల ప్రభావానికి తన వాళ్ల బ్రతుకులు దగ్ధమైపోతున్నట్టు అనిపించ సాగింది.

భవిష్యత్తు ఓ పెద్ద ప్రశ్నలా ఆయన కళ్ళలో చిక్కబడి భయంకరంగా కనిపిస్తోంది. ఏదో సాధించాలి. తనుకూడా తన పిల్లల్ని సుఖపెట్టాలి. భార్యని సంతోషపెట్టాలి. ఎలా? తను చేసే గుమస్తాగిరికి అంతటి సుఖసంతోషాలు లభ్యమయ్యే పనేనా?... లేదు. ఈ గొప్పవాళ్ళని అందలమెక్కించే ఆ అదృష్టం, తనకికూడా వుండాలి. అవును. ఎలా?... ఎలా?... గుర్నాధం గారి మనసులో సముద్ర ఘోషలాంటిది బయలుదేరి వుప్పెనలా ముంచి ఆయన్ని వుక్కిరి బిక్కిరి చేయసాగింది.

## మగశిశువు గర్భంలో మృత పిండం

రక్తవిరోచనాల కారణంగా కృష్ణ అనే 11 మాసాల వయసుగల మగ శిశువును విశాఖపట్నం కింగ్ జార్జి ఆసుపత్రిలో చేర్చారు. కడుపులో వ్రణం వున్నదని మొదట అను కున్నారు. క్షుణ్ణంగా పరీక్షించగా ఆ శిశువు కడుపులో మృత పిండం వున్నట్లు కనుగొన్నారు. శస్త్రచికిత్స చేసి శిశువు పొట్టనుండి పిండాన్ని బయటకు తీశారు. కృష్ణ క్షేమంగా వున్నాడు. ఇలాంటి శస్త్రచికిత్స విశాఖ ఆసుపత్రిలో జరగటం యిదే తొలిసారి.

యింతలో పార్కు అవతలనుంచి...

"హర్యానా లాటరీ! ఒకే ఒక రూపా యితో మీ మీ అదృష్టాన్ని పరీక్షించుకో వచ్చు. పుట్టేవారికి, పెరిగేవారికి వారి బంగారు భవిష్యత్‌కి పునాది వేయటానికి అదృష్టం. కలిసి రాబోతుంది మగపిల్లల చదువులకి, ఆడపిల్లల పెళ్ళిళ్లకి, వ్యాపారా లకి, యింటి యిల్లాలి కోర్కెలు చెల్లించ టానికి చక్కని సదవకాశం జారవిడుచుకో వద్దు. త్వరపడండి. కొద్ది టిక్కెట్లు మాత్రమే వున్నాయి. సాయంత్రమే డ్రా!" అంటూ ఓ వ్యక్తి స్పీకర్‌లో గట్టిగా గొంతు చించుకుని అరుస్తున్నాడు.

గుర్నాధంగారికి 'మగపిల్లల చదువులు, ఆడపిల్లల పెళ్లిళ్ళ' తప్ప యింకేం విని పించటంలేదు. పదే పదే చెప్పే ఆ మాటలు దూరం కాకముందే, ఆయనలో అణిచిపెట్టు కొన్న కోర్కెలు ఒక్కసారిగా, పంజరం నుంచి బయటపడిన పక్షుల్లా, రెక్కలు విదిలించుకున్నట్టయాయి, ఆయన ఒక్కు దుటున లేచి, నాలుగు అంగల్లో పార్కు బయటకి వచ్చారు.

గుర్నాధంగారి మనసు మంచి చెడు ఆలో చించే స్థితిలో లేదు.

ఈ మధ్యనే రెండో కూతూరికి వో సంబంధం వచ్చింది. అది ఆయన తాహతుకి తగ్గ సంబంధమే అయినా, వాళ్ళు అడిగే రెండు మూడు వేల కట్నానికి ఆయన తూగలేకపోతున్నారు. ఆ తర్వాత పిల్లలు ఎదిగేసరికి, ఆ కట్నాల సంఖ్య ఎంతకి పెరుగుతుందో వూహ కందని విషయం.

'తన జీవితం అంతా ధారపోసినా జన్మలో అంత డబ్బుచూడలేడు.' అనే నిర్ధారణకి వచ్చేశారు ఆయన. ఈ అవసరాలు, ఆర్థిక పరిస్థితులు, తనమీద ఆఫీసరుగారికి వుండే అపారమైన నమ్మకాన్ని బుగ్గిపాలు చేస్తున్నాయనే సత్యాన్ని కూడా ఆయన గ్రహించే స్థితిలో లేరు.

జేబులోంచి వో పచ్చనోటు తీసి లాటరీ కుర్రాడి చేతిలో వుంచారు. మొదట అతను తెల్లబోయినా, ఆ వెంటనే, వుత్సాహంగా ఎన్ని కావాలి సార్? అన్నాడు.

"నాలుగు!" గుర్నాధంగారు స్వప్నావస్థలో వున్నట్టు అనేశారు.

ఆ తర్వాత అతను యిచ్చిన టిక్కెట్లు, మిగిలినోట్లు జేబులో కుక్కుకున్నారు. వూహ కందని భ్రమ, మరో అదృష్టాన్ని పరీక్షించు కోమని రెచ్చగొట్టినట్టయింది. అంతే! తను ఆఫీసు నుంచి వస్తూ ప్రతిరోజూ చూసి అసహ్యించుకొనే బ్రాకెట్టు కంపెనీ వైపు, ఆయన పాదాలు సాగి పోయాయి!

ఆవేశం మనిషిలోని వివేకాన్ని చంపే స్తుంది. ఆశ ఆ వ్యక్తిలోని బలహీనతల్ని లొంగదీసుకుంటుంది.

గుర్నాధంగారు కూడా, అదే వున్మాదానికి చిక్కుకున్నారు. [ఇంకా వుంది]




*(గత సంచిక తరువాయి)*

"ఒసే రంగీ! వూరుకోయే. నాను తాగినా నంటే మడిసిని కానన్నయిసయం తెలిసీ నన్ను తొత్తు కొడుకుని సేత్తావుగందా! యిదో యిటు సూడే, మనకేంది లోటు సెప్పు? ఈ పొద్దు పేటుపోరము మీన సింత కాయలు అమ్మినా ననుకో, మాపిటేల సెంటరుకాడ కూకుంటే, ఏ పెద్దోల్ల కాలి బూటన్నా పాలీసు సేసుకోవచ్చు రేపిటేల సేసినికి లగెత్తి, ఆడ నిఫాయేత్తే, యే దొరబాబు పెట్టన్నాకూలికిమోత్తా!యిట్టా వత్తుండ డబ్బుతో తిని తాగి దరిజేగాతిరిగేత్తే యిట్టేరోజు గడిసిపోద్ది. లేని రోజంటావా. కడుపులో కాల్లెట్టుకుని తొంగుంటే. ఆకాశంలో సెందురుడు యించక్కా, అందంగా అగుపిత్తాడు, నాదానివి గదూ? వూరుకోయే రంగే!"

చింత చెట్టు క్రింద, మోకాళ్ళలో తల పెట్టుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్న చింపిరి బట్టల ఆడమనిషిని, భర్త కాబోలు సముదాయించటానికి ప్రయత్నిస్తున్నాడు.

వాళ్ళు వున్నది దాదాపు మూడు నాలుగు వందల గజాల కాళీ ప్రదేశం. అక్కడక్కడ రకరకాల చెట్లు జాట్లు విరబోసుకున్నట్టు, దట్టమైన ఆకులతో గుబురుగా వున్నాయి. ఆ చెట్ల మధ్య బొమ్మరిళ్ళలా తమాషాగా కట్టుకొన్న పాకల్లో, అదోతరహా మనుష్యులు వుంటున్నారు. ఆ ప్రదేశం రోడ్డువారగా వుంది.

ఆ రోడ్డు పక్క కాస్త ఎత్తుగా వున్న చోట, ఓబడ్డీకొట్టు పక్కగా, చిన్న బల్ల మీద కూర్చున్న గుర్నాథంగారు, ఆ దరిద్ర రాముడి నోటివెంట వచ్చిన మాటలకి, ఒక్కసారిగా అదిరిపడ్డట్టయ్యారు.

గుర్నాథంగారి అదృష్టమో, దురదృష్టమోగానీ, ఆయన వచ్చేసరికి బ్రాకెట్టు కొట్టు కట్టేసి వుంది, పక్క కొట్టులో వున్న వ్యక్తిని అడిగితే 'అంతకు అరగంట క్రితమే పోలీసులు వస్తున్నారని తెలిసి వాళ్ళు కొట్టు మూసేసి వెళ్ళిపోయారని' చెప్పాడు.

గుర్నాథంగారికిమొదట చాలానిరుత్సాహం అనిపించింది. కొద్ది సేపటికి అయినా వాళ్ళు తిరిగి వస్తారేమో అనే ఆశతో, జీవితంలో ఏమిటేమిటో సాధించాలనే వెర్రి తపనతో పక్కనే వున్న బల్ల మీద చతికిల బడ్డారు.

అరగంట నుంచి ఆ చెట్టుకింద వాళ్ళ వేషభాషల్ని పీకలవరకు తాగి భార్యని యిష్టం వచ్చినట్టు కొట్టి, తిరిగి అనునయిస్తున్న ఆ మనిషి ప్రవర్తనని గమనిస్తూ కూర్చున్నారు. బ్రాకెట్టు వాళ్ళు అయితే రాలేదుగానీ, ఆ వ్యక్తి మాటలతో గుర్నాథంగారి ఆవేశం క్రమంగా చల్లబడి, వివేకం లాంటిది ఆయన వెన్ను చరిచి హెచ్చరించటం మొదలుపెట్టింది.

'తాను అరగంట క్రితం చేసిన పని ఏమిటో, ఏం చేయాలని యింత దూరం వచ్చారో తలుచుకోగానే ఆయన మనసు పశ్చాత్తాపంతో దహించుకు పోతున్నట్టనిపించింది. భయంతో వణికి పోయింది. సిగ్గుతో, అభిమానంతో కృంగిపోతున్నట్టయింది.

ఎలా యింటికి చేరుకున్నారో కూడా ఆయనకే తెలియదు.

ఈ పదిరోజుల నుంచి సుశీలమ్మ భర్త మనసులో చెలరేగే అశాంతిని, వో కంట గమనిస్తూనే వుంది. ఆయన యింటికి ఆలస్యంగా రావటం ఎవర్నీ పలకరించక పోవటం, ఒంటరిగా పడుకొని దీర్ఘంగా ఆలోచించటం...యివన్నీ ఆవిడ దృష్టి నుంచి –దాటిపోలేదు యిప్పుడు కూడా ఏదో పోగొట్టుకున్న మనిషిలా భర్త రావటం గమనించి, గ్లాసుతో నీళ్ళు తీసుకొని గది లోకి వెళ్ళింది. ఆయన మంచానికి అడ్డంగా పడుకుని వున్నారు.

"మంచినీళ్ళు!" దగ్గరగా వచ్చి పలకరింపుగా అంది.

ఆయన పురెక్కి వస్తున్న కళ్ళు విప్పా

74సం.గా అఖండ ప్రఖ్యాతిగాంచిన

**నారసింహాలేహ్యం**

రిజిష్టర్డు ట్రేడ్‌మార్కు

అన్ని రకములైన (ముఖ్యముగా పురుషుల బలహీనతలను) పోగొట్టి రక్త వృద్ధిని, పుష్టిని కల్గించు వాజీకరము.

1డబ్బా రు. 7—25 పోస్టేజి ప్రత్యేకము.

**పి. శి. ఏ. అండ్ కో.,**

షెరిదేపి 523273 (శ్రీకాకుళంజిల్లా)

క్యాటలాగు ఉచితము. కోరినవారికి ఏజన్సీలు ఇవ్వబడును.

**శిక్షణ లీల**

ఇంగ్లీషు-తెలుగు(హాండీ) 3-30

ఇంగ్లీషు-ఇంగ్లీషు(పాకెట్) 2-50

**తెలుగు-ఇంగ్లీషు**

మీడియం డిక్షనరీ.......3-50

హాండీ డిక్షనరీ............2-25

అన్నిపుస్తకముల షాపులలోను, రైల్వే బుక్‌స్టాల్సునందు లభించును.

పుస్తకముల వెల మనియార్డరు చేసిన పోస్టల్ చార్జీలు

VPP ద్వారా పెట్టబడును

**న్యూ స్టూడెంట్సు బుక్ సెంటర్**

ఏలూరురోడ్డు...విజయవాడ.2...ఫోన్: 74677 62222

# శు భ వా ర్త



నాడీప్రవీణ, దీర్ఘరోగ నిపుణులు

**డా॥ ఎస్. ఎస్. రావు,** M.B.H., R.M.P.

గారిని సంప్రదించండి :

**రావూస్ ప్రొడక్ట్సు & క్లినిక్,**

చింతలబస్తీ, 6–2–961, ఖైరతాబాదు,

హైదరాబాదు–500004 (ప్రీమియర్ కేఫ్ సందులో)

శరీర బలహీనత, పూబిగా పెరుగుటగాని, చిన్నప్పటినుండి సన్నగానుండి ఏమందువలన లావు కాకపోవుట అంగములు వుండవలసిన సైజులో వుండక పోవుట, నరములబలహీనత, మానసిక వ్యాధులు, ఫిట్సు, భయం, గుండె దడ, రక్తప్రసరణ ఎక్కువగావడం లేక తక్కువగావడం, సర్వవిధములగు దగ్గులు, ఉబ్బసం, పొత్తి కడుపు ఎత్తుగా పెరగడం, జలోదరం, కడుపునొప్పి, గ్యాస్ట్రిక్ ట్రబుల్స్, లివర్ జబ్బులు, కడుపులో గాలి చేరుట, స్త్రీల ముట్టు కుట్టునొప్పి, కుసుమవ్యాధి [ఏ రంగైనాసరే] మూత్ర వ్యాధులు, మూలశంక, వరిబీజం, సుఖవ్యాధులు, స్త్రీలకుగాని, పురుషులకుగాని ఒకరిపై ఒకరికి విముఖత, పిల్లలు లేకపోవుట, వీపునొప్పి, నడుమునొప్పి, కీళ్ల వ్యాధులు, వాపు, నీరుచేరుట, చర్మవ్యాధులు, పుండ్లు, ఎక్కడైనాచర్మము పెళుసరి ఎక్కుట, బోదవాపు, జ్వరం, పక్షవాతం, మొదలైన వ్యాధులు దీర్ఘ వ్యాధులుగా పరిణమించినపుడు మాత్రమే వీరు చికిత్సచేయుదురు. తరుణ వ్యాధులు వీరు తీసుకోరు.

**క్యాంపు ప్రతినెల అక్టోబరు నుండి :**

4వ తేదీ : కర్నూలు: రవిప్రకాశ్‌లాడ్జి— 5వ తేదీ : అనంతపురం : హోటల్ సప్తగిరి —6వ తేదీ : గుంటకల్ శ్రీలాడ్జి : 7వ తేదీ కడప : ప్రతాప్‌లాడ్జి, స్టేషన్‌రోడ్— 8వ తేదీ : తిరుపతి: భీమాస్ అనెక్స్ లాడ్జి— 9వ తేది : మదనపల్లి : శ్రీలాడ్జి— 10వ తేది : చిత్తూరు : M. S. R. లాడ్జి, 11, 12 తేదీలు, మద్రాసు: కోమలనిలాస్, 5 ఫ్రాన్సిస్ జోసఫ్‌స్ట్రీట్, (జి.టి.)— 13వ తేది : నెల్లూరు : రాఘవ విహార్— 14వ తేది : ఒంగోలు : అభిలాష్‌లాడ్జి— 15వ తేది : గుంటూరు : ఉడిపి శ్రీకృష్ణభవన్, స్టేషన్‌రోడ్— 16, 17, తేదీలు వైజాగ్ . బృందావన్‌లాడ్జి, డాబాగార్డెన్స్ — 18, 19 తేదీలు : రాజమండ్రి: శాంతి నివాస్ లాడ్జి—20వ తేదీ, కాకినాడ : శాంతినివాస్‌లాడ్జి, గవర్నమెంటు హాస్పిటల్ ఎదుట— 21వ తేదీ : ఏలూరు : హోటల్ మధులత— 22, 23 తేదీలు : విజయవాడ : మాడరన్ కేఫ్, గాంధినగర్— 24వ తేది : ఖమ్మం : మయూర్ కేఫ్ (శేష్‌మహల్ లాడ్జి) 25వ తేదీ : వరంగల్ : నటరాజ్ హోటల్— 26వ తేది నుండి హెడ్డాఫీస్.

SWASTIK

## తృప్తి

ఆ తర్వాత లేచి నెమ్మదిగా గ్లాసు అందుకున్నారు.

"ఎంత మొత్తుకున్నా నాకు కంఠ శోష మిగులుతోంది. అందుకే నాలుగు రోజుల క్రితం, రెండోదాని చేత మీరు రాసినట్టు, పెద్దదానికి 'రమ్మని' ఉత్తరం రాయించాను!" సుశీలమ్మ ఖాళీగ్లాసు అందుకుంటూ సాధింపుగా అంది.

గుర్నాథంగారు మరోసారి ఉలిక్కిపడ్డట్టు చూసారు.

"ఎంతపని చేసావు సుశీలా !" అన్నారు భారంగా.

ఆ ఒక్క మాటతో "ఆ పని నేను చేయలేకేనా వూరుకున్నాను" అన్న భావం స్ఫురించినట్టయింది ఆవిడకి.

"నారు వేసినవాడూ నీరు పోయకపోడు లెండి" అంది సమర్థింపుగా.

"కానీ, సుశీలా ! ఆ భగవంతుడే, పరిస్థితులను ఎరగా వేసి మనిషి పతనానికి కూడా అడ్డుదారి చూపిస్తాడు." అన్నారు వేదనగా.

ఆయన మాటలు సుశీలమ్మకి ఏమాత్రం అర్థం కాలేదు.

"పోనిండి ! అనుకున్నవి అనుకున్నట్టుగా ఎప్పుడూ జరగవు. రేపటికి కావలసిన సరుకులన్నీ పెద్దాడితో తెప్పించాను!" అంది తన ధోరణిలో.

"సరుకులా ? నేను డబ్బులు యివ్వలేదుగా?" ఆయన తెల్లబోయి చూసారు.

"నాది సన్నది కాశికాయ గుళ్ల గొలుసు వుంది కదా? ఎన్నాళ్లనుంచో కాంతమ్మగారికి దానిమీద మక్కువగా వుందట. ఆవిడే దాన్ని కొనుక్కున్నారు."

గుర్నాథంగారు క్షణకాలం అవాక్కయిపోయారు. ఆ వెంటనే ఆయన మొహం సిగ్గుతో బాధతో కృంగిపోయినట్టయింది.

"ఇన్నేళ్లలో ఒక్కరోజు అయినా నిన్ను సంతృప్తిగా సంతోషపెట్టిన రోజు గుర్తు రావటంలేదు సుశీలా! కనీసం నీ చేతులకి వో జత గాజులు అయినా చేయించలేని నిర్భాగ్యుణ్ణి. ఏదో అది మీ పుట్టింటివాళ్లు పెట్టింది. ఏ శుభకార్యాలకి అయినా వెళ్లేటప్పుడు, మెడలో పచ్చగా నిండుగా కనిపించే వస్తువుని అమ్మేశావా?" అన్నారు

బాధగా కణతలు రుద్దుకుంటూ.

భర్త మొహం చూడగానే ఆవిడకి జాలేసింది. దప్పున దగ్గరకొచ్చి, చెదిరిన ఆయన జుట్టు ఆప్యాయంగా సవరించింది.

"ఎంత పిచ్చివారండీ మీరు! ఆ సగల్ని చూసుకోగానే మన కడుపులు నిండిపోతాయా? మన సమస్యలు తీరిపోతాయా" అంది అనునయంగా.

"అది కాదు సుశీలా!" ఆయన ఆరాటంగా ఏదో చెప్పబోయారు

"చాల్లెండి. ఇం నాకేం చెప్పవద్దు. చూడండి! మొహం పీక్కుపోయి ఎలా వున్నారో? ఈ మాత్రం దానికేనా,



పాడుచేసుకొని ఈ పది రోజుల నుంచి పిచ్చి మనిషిలా తయారయ్యారు'' అని విరు కోపంగా చూస్తూ సుశీలమ్మ అక్కడినుంచి వెళ్ళిపోయింది.

ఈసారి గుర్నాథంగారికి ఆవిడ ఎంద లింపులో చిరాకు, కోపం, సాధింపు లాంటివి కనిపించలేదు. ఆ అసునయానికి, ఈ పది రోజులుగా తను పోగొట్టుకున్న మనశ్శాంతి తిరిగి లభించినట్టు స్థిమిత పడ్డారు

ఆ రాత్రి భోజనానికి వెళ్ళబోయే ముందు గుర్నాథంగారికి హఠాత్తుగా డబ్బు విషయిం గుర్తుకొచ్చింది. ఒక్క క్షణం పాముని జేబులో పెట్టుకున్నట్టు వణికి పోయారు. ఆ డబ్బు యింకా తన దగ్గరే వుంటే తన పతనాన్ని మరే విధంగా ప్రోత్సహిస్తుందోనని భయపడిపోయారు. దాదాపు అంఎనట్టుగా పిలిచి భార్య చేతికి డబ్బు యిచ్చి 'జాగ్రత్తగా వుంచమని' హెచ్చరించారు.

* * *

తెల్లవారితే ఉగాది!

పండుగ రోజుకి గుర్నాథంగారి అల్లుడు కూడా వచ్చేశాడు. చీకటితోనే అందరి తల స్నానాలు మొదలయ్యాయి. గుర్నాథంగారి మూడో కూతురు తడితల తుడుచుకుంటూ స్నానానికి తండ్రిని పిలవడానికి వచ్చింది.

కూతురు కట్టుకున్న తెల్లపూల వోణీ వైపు ఆయన ఆశ్చర్యంగా చూశారు. ఆచీర సుశీలమ్మది. క్రిందటేడు యిదే పండుగకి ఆయన దాన్ని ఆవిడకోసం తెచ్చారు. ఆవిడ ఈ చీర ఎక్కువగా వాడిన గుర్తు కూడా లేదు. ఒకవేళ కట్టినా చాలా పొదుపుగా వుంచుకుంటుంది. అందుకే ఏడాది అయినా కళ మాసిపోకుండా కొత్తచీరలా బావుంది. అయితే కొంగుపట్టి ఒకటి రెండు చోట్ల చినుగు పడినట్టు మాత్రం ఆయనకిగుర్తు!

''అమ్మ ఈ చీర వోణీలుగా చేసింది నాన్నా! ఇది మరో రెండు నెలలవరకు నేను జాగ్రత్తగా వాడుకుంటాను. అప్పటికి నా మిషను పూర్తి అవుతుందికదూ? ఈలోపల అమ్మ చెల్లాయికి కూడా పమిట వేయిస్తుంది అప్పుడు యిది దానికి యిచ్చి, చినుగు పట్టింది నేను యింట్లో వాడుకుంటాను.'' తండ్రి కళ్ళలో కదిలే ప్రశ్నకి సంజాయిషీగా సంబరంగా చెప్పింది ఆ పిల్ల.

ఆయన 'అలాగా' అన్నట్టు తల పంకించి పెరటివేపు వెళ్ళారు! ఆ తర్వాత స్నానం పూర్తిచేసి ముందు గదిలోకి రాబోతూ ఆగిపోయారు. పెద్ద కొడుకు ఏదో ఎత్తుపుతో కుస్తీ పట్టటం కనిపించింది.

''ఏమిట్రా నాన్నా అది?'' అంటూ అడిగారు.

''పెన్ను నాన్నా! రెండో అక్కయ్య పాత డొక్కు పెన్ను. పెద్దబావగారు బాగు చేస్తానని చెప్పారు.'' తలెత్తకుండానే ఆ పెన్నుతో పోట్లాడుతూ సమాధానం యిచ్చాడు.

ఒక్క క్షణం ఏం అన్నారో ఆయనకి తోచలేదు.

ఆ రోజులో కరిగిపోయి గాలం గిర్రున కదిలిపోతోంది.

మధ్యాహ్నం మూడు గంటలవేళప్పుడు ఆఖరి కొడుకు వో పుస్తకం తీసుకొచ్చి అందులో భాగాహారం లెక్క అర్థంకావటం లేదని




డా. పి.వి.కె. రావ్, B.A., సెక్స్ స్పెషలిస్ట్



వైద్య విద్వాన్ — వైద్యాచార్య
హస్తప్రయోగం నరముల బల హీనత, అంగము చిన్నదగుట, శీఘ్రస్ఖలనము, శుక్లనష్టము, సుఖరోగములకు, మానసిక వ్యాధులకు శాస్త్రీయ చికిత్స, పోస్టుద్వారాకూడా చికిత్స గలదు.

రావూస్ క్లినిక్
టి. బి. రోడ్, తెనాలి. ఫోన్ : 700.

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేపనముతో
చికిత్సను పొందండి
— శస్త్రచికిత్స
అవసరములేదు!

దేహపుష్టికి
ఆరోగ్యానికి
పండిత డి గోపాలాచార్యులవారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్)లిమిటెడ్
మదరాసు 17.

ఆత్మ రక్షణకు
(లైసెన్సు అవసరములేనిది)
పోర్టింగు 50 షాట్సు ఆటోమెటిక్ పిస్టల్ దొంగలు భయమునుండి మరియు క్రూర మృగముల బారినుండి మిమ్ములను రక్షించు కొనుటకు, కాంతివంతమైన మెరుగును మరియు గొప్ప ధ్వని ఇచ్చును.




గన్ బ్లాక్ కలర్ ధర రు. 60/-మాత్రము. లెదర్ కేసు మరియు 100 షాట్సు ఉచితము. పోస్టేజి రు. 7/- అదనము అదనపుషాట్సు వందకు రు. 5/—.

GUNMETAL (India) [A.P.]
Mahabir ganj, ALIGARH (U.P.)

WHEN NATURE FAILS

H New Super eight మరింతఎత్తు,పొడుగు కాగలరు (2మండి 8అం. వరకు పూచి)
మీరుపొడుగు పెరగదలచుకుంటే ప్రపంచప్రఖ్యాతి పొందిన మా హైటెక్స్ HYTEX ఔషధాన్ని వాడండి. వయోపరిమితిలేదు. స్త్రీలు, పురుషులు కూడా పుచ్చుకోవచ్చు. HYTEX is a great name and meant for popular people.
1 Phail (20 T A B S.) Rs 7.50 advance By M O 3 Phails(60Tabs) Rs. 15/- money order by advance

M/S. VICTORIA COMMERCIAL COY
Beat No. 1, Ambala Cantt-133001 (N.I.)
Correspond in English (AMW/10/77)

తండ్రిని అడిగాడు కొడుకు చేతిలోవున్న పచ్చ పెన్సిల్‌ముక్క చూసి "ఎక్కడిదిరా యిది?" అని అడిగారు.

"అన్నయ్య బండ పెన్సిల్ నాన్నా! వాడికి అంత పెద్దది అవసరం లేదటగా! నన్ను సగం విరుపుకోనిచ్చాడు. నువ్వు కొనవద్దులే నాన్నా! యిదే బోలెడన్ని రోజులు వస్తుంది నాకు!" కళ్ళు చక్రాల్లా తిప్పుతూ తన చిన్నారి చేతుల్తో అనునయిస్తున్నట్టుగా గారంగా తండ్రి గడ్డం పుచ్చుకుని అటు యిటు కదిలిస్తూ ముద్దుగా చెప్పాడు.

గుర్నాధంగారికి నోట మాట రాలేదు.

ఉదయమే సుశీలమ్మ 'ఖర్చులకి వుంచండి' అంటూ నాలుగు రూపాయలు ఆయనకి యిచ్చింది. ఆ డబ్బుతో చిన్న కూతురికి పుస్తకం వస్తుందేమో అని పిలిచి అడిగారు.

"ఎగ్జామ్స్ ఎలానూ దగ్గర కొచ్చాయి కదు నాన్నా! యిప్పుడు ఫుల్ రేటుపెట్టి కొత్త పుస్తకం తీసుకొన్నా రేపు అమ్మేటప్పుడూ వాళ్ళు ఆఫ్‌రేటుకికూడా తీసుకోరు. ఈ నాలుగు రోజులు మా ఫ్రండ్ పుస్తకంతో చదువుకుంటాను" అని చెప్పింది.

ఈ ఆర్థిక పరిస్థితుల్ని జయించలేని తన అసమర్థతకో లేక తన నిస్సహాయతని అర్థం చేసుకొన్న పిల్లల అవగాహనకో, ఆయన హృదయం సిగ్గుతో బాధతో ముడుచుకుపోయినట్టయింది.

నీళ్ళు నిండిన కళ్ళతో చప్పున ఆ పసివాడిని గుండెలకి హత్తుకుని, ఆర్తిగా ముద్దు పెట్టుకున్నారు.

యిన్ని విషయాల మధ్య, ఆయనకి మరో సంగతి తెలియకపోలేదు. నెలరోజుల క్రితం విరిగి మూలపడిన భార్య ముక్కుపుడక తన మనవడి- చిటికినవేలికి ముద్దుటుంగరంగా రూపుదిద్దుకుంటుందని గ్రహించారు.

ఆ రోజు ఆఫీసరుగారు రమ్మన్న సంగతి గుర్నాధంగారికి గుర్తుకు వచ్చింది. కొడుక్కి లెక్కలు చెప్పి పంపించి, బట్టలు వేసుకొని బయలుదేరారు. తలుపుమూల వున్న చెప్పులు వేసుకోబోతూ ఒక్కక్షణం ఆగారు! పూడ్చిన చెత్త పక్కగా వుండచుట్టిన కాగితాలు తీసి విప్పారు. అవి చూస్తూనే

# తృప్తి

ఆయన ఒళ్ళు జలదరించి నట్టయింది. వెంటనే వాటిని ముక్కలు చేయబోయారు.

"అయ్యో! అదేమిటండీ? లాటరీ టిక్కెట్టుల్లా వున్నాయి!" అప్పుడే లోపలి కొచ్చిన సుశీలమ్మ కంగారుగా అడిగింది.

"అవును!" అంటూనే చిన్న చిన్న ముక్కలుగా చించేసారు.

"నిన్ననే డ్రా!... అంటే... ఫలితాలు ఈరోజో రేపో వేయొచ్చు. అయ్యయ్యో!" అంటూ ఆవిడ లబలబలాడింది.

"మన ఫలితాలు యింకా దారుణం సుశీలా!" అంటూ గుర్నాధంగారు తిరిగి మంచంమీద కూలబడి తిరిగి ఆ కాగితం ముక్కలకి అగ్గిపుల్ల వెలిగించేశారు.

సుశీలమ్మకి భర్త ధోరణి అర్థంకాలేదు. ఆయన నిన్న జరిగిన సంఘటన అంతా వివరంగా చెప్పారు. భార్య కూడా క్షణకాలం విస్తుపోయింది.

"జరిగినదేదో జరిగిపోయింది! వాళ్ళ డబ్బు పూర్తిగా యిచ్చేసే వాళ్ళంగా! ఎందుకంత తొందరపడి వీటిని మసి చేశారు!" సుశీలమ్మ కాస్త అసంతృప్తిగా, సాధింపుగా అంది.

ఆయన వేదాంతిలా, గంభీరంగానవ్వారు. "పిచ్చిదానా! ఈలక్షలు, లక్ష్యాలుమనకి వద్దు. అవి తెచ్చే ఆడంబరాలు, అతిశయాలు అనర్థాలు అసలే వద్దు. పరిస్థితుల ధాటికి తట్టుకొనే శక్తిని యిచ్చే తృప్తిని మించిన సంపద మరేదీ మనకి వద్దు!" అన్నారు నిశ్చలంగా.

ఆయన మాటల్లోని దృఢ విశ్వాసం, ఆవిడ అసంతృప్తిని మంచులా కరిగించేసి నట్టయింది. గుర్నాధంగారికి ఎందుకో ఎన్నడూ లేనంత నిశ్చింత కలగసాగింది. పచ్చగా, నిండుగా, పిల్లలతో కళకళలాడుతున్న ఆ వాతావరణాన్ని విడిచి ఎక్కడికో దూరంగా వెళ్ళాలని అనిపించలేదు. అందుకే ఆఫీసరుగారి యింటికి వెళ్ళే ప్రయత్నం విరమించుకున్నారు.

ఆ రాత్రి గుర్నాధంగారు పెరట్లో పడక కుర్చీ వాల్చుకుని, దానిలో వెనక్కివాలి పడుకున్నారు. కట్టుకున్న భార్య దగ్గర నుంచి, కన్న బిడ్డల వరకు... వాళ్ళు చూపించిన సామరస్యం తలుచుకొంటుంటే, ఆయన మనసు ప్రఫుల్ల మవసాగింది.

'ఏవేవో అవసరాలు తన ప్రాణంమీద కొచ్చి, విరుచుకు పడుతున్నాయని భయపడ్డాడుగానీ అవి సరిపెట్టుకోలేనివిమాత్రం కావన్నమాట. హఠాత్తుగా గుర్నాధంగారికి నిన్న చింతచెట్టుక్రింద తను చూసిన దంపతులు గుర్తుకొచ్చారు. ఆ వెంటనే ఆఫీసరు అయన భార్యకూడా కళ్ళముందు కదిలారు.

'జీవితం విలువ తెలియని వాళ్ళు ఒకరు, తెలిసీ నిర్లక్ష్యం చేసేది మరొకరు. ఒక్కొ మెట్టు పైకి రావాలన్న ఆలోచన వుండదు. క్రిందివాళ్ళకి. పర్వతంలా ఒకేసారి పెరిగిపోవాలన్న ఆశ పెద్దవాళ్ళకి.

కానీ, అటు క్రింది వాళ్ళని అనుసరించలేక, యిటు పైవాళ్ళని అందుకోలేక ఆర్థిక పరిస్థితుల వత్తిడికి నలిగిపోయేది తనలాంటి మధ్యతరగతి మనిషి' ఆ లోపం ఎక్కడ వుందో యిప్పుడు ఆయనకి పూర్తిగా అర్థమవుతోంది. ఆయన మనసు దానికి పరిష్కారాన్ని కూడా ఆలోచించింది.

'పెద్దకూతురు పెళ్ళికి తీసుకున్నలోను యింకా పూర్తిగా తీరనేలేదు. రెండో కూతురి పెళ్ళి ఎలా చేయాలా అని నిన్నటి వరకు మదనపడేవారు. కానీ, ఈరోజు అలా కాదు. తిరిగి లోను తీసుకుని ఆ సంబంధమే ఖాయపరుచుకోటానికి గుర్నాధంగారు నిశ్చయించుకున్నారు.

'ఎలా లేదన్నా మరో ఐదేళ్ళ వరకుతనకి సర్వీసు వుంది. అప్పటికి ఈలోన్ను పూర్తిగా తీర్చివేయగలడు! యింకా తన రెక్కల్లో శక్తి వుంది. శ్రమపడి మిగతాపిల్లల బాధ్యత కూడా సక్రమంగా నెరవేర్చగలడు. కొడుకుల్ని చదివించగలడు. చదివించలేక పోయినా బాధలేదు. తన బిడ్డలకి పరిస్థితుల్ని అర్థం చేసుకోగల జ్ఞానం వుంది' అనుకున్నారు.

ఆ వూహ రాగానే, గుర్నాధంగారు నిశ్చింతగా నిట్టూర్చారు!

## గమనిక

గేయాలు పంపేవారు వాటితో తపాలా కార్డు జత పరచవలసి వుంటుంది. గేయాలు త్రిప్పి పంపబడవు. గేయాలు, కవితలు సాధ్యమైనంత క్లుప్తంగా వుండటం మంచిది —సం.